# 'ఇహమున సుఖింప హేమతారక విద్య పరమున సుఖింప బ్రహ్మవిద్య'

ఉపకారము చేయని జీవితంబు
కారము లేని వంట
ఆకారము లేని యిల్లు
మమకారము లేని జీవితము
ప్రాకారము లేని మందిరము
ఓంకారము లేని మంత్రము
వికారముగ నుండు చూడరె!

**విద్యార్థులారా!**

'విద్యాతపోభ్యాం పూతాత్మనే.' విద్య, తపస్సు కలిగిన మానవుడే పవిత్రుడు కాగలడని దీని అర్థము. ఈనాడు అధిక విద్యలనభ్యసించి ఉన్నత పదవులను స్వీకరించి, పవిత్రమైన కీర్తిని సాధించి, జీవితము చీకు, చింత లేకుండా సుఖముగా గడపటమే జీవితములో ప్రధానమైన విషయమని భావిస్తున్నాము. Sanitary Worker మొదలు Prime-minister వరకు విద్యయొక్క బలముచేతనే అనేక విధములుగా జీవితాన్ని పోషించుకుంటూ వస్తున్నారు. ఐతే ఈ విద్యలు భౌతికమైన, ప్రాకృతమైన, లౌకికమైన సదుపాయములు మాత్రమే కూర్చుతున్నవి. ఇవి కేవలం జీవనోపాధి నిమిత్తమై యేర్పడిన విద్యలనే సత్యాన్ని గుర్తించి వర్తించటమే యీనాటి విద్యార్థులయొక్క ప్రధాన కర్తవ్యము.

**విద్యకు, ఆధ్యాత్మిక విద్యకూడా జోడించాలి**

'ఆధ్యాత్మిక విద్యా విద్యానాం'. భౌతిక విద్యకు, ఆధ్యాత్మిక విద్యకూడా కొంత జోడించాలి. 'విత్' అనే ధాతువుకు 'య' అనే ప్రత్యయము చేర్చినప్పుడే విద్య అవుతుంది. 'య' అనగా ఏది,

sri sathyasai vachanamrutam

'విత్' అనగా ప్రకాశము. ఏది ప్రకాశము నందించునో అదే విద్యయని యీ పదము యొక్క అంతరార్థము. ఈ విద్య కేవలము ఒక్క బ్రహ్మవిద్యకు మాత్రమే సంబంధించినది కాని, లౌకిక విద్యలకుగాని, భౌతిక విద్యలకుగాని, జీవనోపాధి విద్యలకుగాని సంబంధించినది కాదు. ఇవి జగత్తు నందు మానవజీవితము సుఖప్రదముగా, ఆనందముగా అనుభవించాలనే వాంఛలతో అభ్యసించే విద్యలు. ఐతే పక్షికి రెండు రెక్కలవలె, రథమునకు రెండు చక్రములవలె యీ విద్యకూడను మానవ జీవితానికి అత్యవసరము.

**ఇహమున సుఖింప హేమతారక విద్య**
**పరమున సుఖింప బ్రహ్మ విద్య**

ఈనాటి విద్యలు యిహపరములకు రెండింటికికూడను అన్వయించలేకపోతున్నవి. చదవటంవేరు, జీవించటము వేరు. కనుక, యీ చదువులు నిత్యజీవితములో జీవనోపాధికికూడను విరుద్ధముగా ప్రవర్తిస్తున్నవి. మనం ప్రతి విద్యనుకూడను వినియోగపూర్వకముగా అనుభవించాలి. దానితోబాటు మనం విద్యానందాన్ని అనుభవించాలి కాని, విషయానందమును కాదనే సత్యాన్ని గుర్తించాలి.

**తపస్సనగా మనోవాక్కాయములు మూడింటి ఏకాత్మ స్వరూపమును అనుభవించటమే !**

ఇంక రెండవది తపస్సు. తపస్సనగా యేమిటి? ఆలుబిడ్డలను వదలి, ఇల్లు, వాకిలి వదలి అరణ్యములో ప్రవేశించి తలక్రింద, కాళ్ళుపైకి పెట్టి గబ్బిలమువలె జీవించటము కాదు. తపస్సనగా కాయము, వాక్కు, మనస్సు మూడింటియొక్క ఏకాత్మ స్వరూపాన్ని అనుభవించటమే! దీనినే The proper study of mankind is man అన్నారు. అనగా తలంపులు, వాక్కులు, క్రియలు ఏకంగావించటమే తపస్సు యొక్క అంతరార్థము. యీ సత్యాన్ని గుర్తించుకొనలేక మూఢులైనవారు అనేక విధములైన యిక్కట్లకు గురౌతున్నారు. విద్య బ్రహ్మను చూపుతుంది. తపస్సు బ్రహ్మలో చేరుస్తుంది. బ్రహ్మ అనగా ఏమిటి? సర్వవ్యాపకమైన శక్తి. అది మీయందే ఉంటున్నది. నీవే ఆ యొక్క స్వరూపమై ఉంటున్నావు. నీ తత్త్వాన్ని నీవు గుర్తించటానికి ప్రయత్నించటమే తపస్సు. మొట్టమొదట నేనెవరు అనే సత్యాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి.

**బ్రహ్మతత్త్వము ఆరు విధములైన భావములతో చేరి ఉంటుంది**



sri sathyasai vachanamrutam

బ్రహ్మ తత్త్వమనగా ఆరువిధములైన భావములతో చేరి ఉంటుంది. నిత్యమై, నిశ్చలమై, ఏకత్వమై, నిరుపాధికమై, నిర్దోషితమై, సమానాధిక రహితమైఉంటుంది. నిత్యమనగా ఉత్పత్తి, వినాశము లేని స్థితి. అనగా, దీనికి ఒక ఆది, అంత్యమనేది లేదు. ఉత్పత్తి గాని, వినాశముగాని లేనిదని యీ నిత్యమనే పదమునకు అర్థము. నిశ్చలమనగా అందులో ఉన్న గుణములను వర్ణించుటకు కాని, వివరించుటకు గాని సాధ్యము కాదని భావము. 'యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసః' యేవిధముగా కాని వర్ణించటానికి సాధ్యము కాని గుణము యీ బ్రహ్మతత్త్వముగా ఉంటుంది. మూడవది ఏకత్వమై అనగా నిస్సంఖ్యాకములైన అనగా అనేక గుణములు లేనిదిగా ఉంటుంది. నాలుగవది, బ్రహ్మతత్త్వము నిరుపాధికముగా ఉంటుంది. ఇది ఎట్టి ఉపాధిని ఆశ్రయించదట! ఒక ఉపాధిగాని, ఒక ఆకారంగాని యేనాడు ఉండదట. నిత్యజీవితములో మనము సత్యముగా అనుభవించే మనస్సుకే ఒక ఆకారం లేదు. జీవితంలో ప్రతి ఒక్కదానికి మనము పేరును ఉచ్చరిస్తున్నాము. ఉదాహరణకు మనస్సును Mind, mind అంటున్నాము. కానీ, దాని రూపమేమిటో మనకు తెలియదు. మనము చాలాదుఃఖిస్తున్నాము, అనుకుంటున్నాము. What is the shape of worry? It is mentally created fear only. ఇది కేవలం మానసిక దృష్టితో కూడిన ప్రభావమే! కనుక, నిరుపాధికములనగా యేమి? దీనికి ఉపాధియే లేదు. ఇంక ఐదవది, కేవలం నిర్దోషితము. దీనిలో దోషమనేది, మాలిన్యమనేది, హేయమైనది యేమాత్రంకూడను ప్రవేశించుటకు వీలుకాదు. చివరగా 'సమానాధిక రహితమై', అనగా సమానము అనేది దీనిలో చేరటానికి వీలుకాదు. తాను తానుగానే ఉంటుంది. కాని వేరొక వస్తువుగా ఉండదు. బ్రహ్మతత్త్వమునకు ఒకవిధమైన సమానమైన తత్త్వంలేదని చెప్పటానికి ఆధారం ఏమిటి? ఈ వస్తువు ఎట్లా ఉంది? ఈ వస్తువు యీ వస్తువుగానే ఉంది. కాని దీనిని compare చేయటానికి యేవిధముగా వీలుకాకుండా ఉంది. ఒక వస్తువును మరొక వస్తువుతో పోల్చటానికి పోయినప్పుడు, యీ వస్తువువలె ఆ వస్తువు సర్వకాలములందు, సర్వస్థానములయందు, సర్వ పరిస్థితులయందుకూడను ఉండినప్పుడే అవి compare చేయటానికి వీలవుతుంది. దేశకాల పరిస్థితుల ప్రభావములకు అతీతమైన తత్త్వాన్ని యేవిధముగా compare చేయటానికి వీలవుతుంది.?

**మార్పు చెందే వస్తువు, మార్పును అనుభవించే వ్యక్తినికూడను మార్పు చెందేటట్లు చేస్తుంది**

sri sathyasai vahini

ఒక తల్లి గర్భములో twins గా పుడతారు. ఆ twins ని కూడను పూర్తిగా compare చేయటానికి వీలుకాదు. ఏదో కొన్ని విషయములలో ఒకరికి, మరొకరికి భేదములుంటాయి. అంతేకాకుండా, జగత్తులో ప్రతిపదార్థముకూడను మారేదే! ఈ మారుతూ మారుతూ ఉండినప్పుడు ఒక వస్తువు మరొక వస్తువుతో యే విధముగా compare చేయటానికి వీలవుతుంది? కనుకనే నిత్యమై, నిశ్చలంబులై నిస్సంఖ్యాకములై, నిరుపాధికములై, దోషరహితమై, సమానాధికమై అనగా compare చేయటానికి యేమాత్రము అవకాశము లేనిది. దీనినే బుద్ధుడు "మార్పు చెందే స్థితి ప్రపంచము కల్గిఉంది. సర్వమ్ దుఃఖం దుఃఖం, సర్వమ్ క్షణికం క్షణికం, సర్వం అనిత్యం" అని వర్ణించాడు. కనుకనే యీ జీవితమంతాకూడను, ఈ ప్రకృతి అంతయుకూడను క్షణక్షణమునకు మార్పులు చెందుతున్నాయి. ఈ మార్పులకు తగినట్లుగా రూపములుకూడను మార్పుచెందుతున్నాయి. నీ రూపముతోపాటు నీపేరు కూడను మార్పు చెందుతూ వస్తుంది. నీవు పుట్టిన తక్షణమే small child అన్నారు. ఆనాటి రూపము యేదో ఒక రక్తపు ముద్దవలె ఉంటుంది. పెరుగుతూ పెరుగుతూ బాలుడుగా తయారైనావు. 10 years వచ్చేటప్పటికి నిన్ను boy అని పిలుస్తూ వచ్చారు. తరువాత కొన్ని సంవత్సరములకు man అని పిలుస్తారు. 75 years అయిపోయింది grandfather అని పిలుస్తారు. కనుక యీ child, boy, man, grand father అందరూ ఒకడే అయినప్పటికి, నీ శరీరము ఎన్ని మార్పులు చెందింది! ఈవిధముగా మార్పుచెందే వస్తువును, మార్పుచెందే మరొక వస్తువుతో యేరీతిగా compare చేయటానికి వీలవుతుంది? ఏవస్తువు మానవునకు సుఖము నందించుచున్నదో ఆ వస్తువు మార్పు చెందుతుంది. ఏవ్యక్తి యీ సుఖముననుభవిస్తున్నాడో ఆ వ్యక్తికూడను మార్పు చెందుతున్నాడు. మార్పు చెందింపచేసే వస్తువు, మార్పును అనుభవించే వ్యక్తినికూడను మార్పు చెందింపచేస్తుంది. కనుక సుఖమునిచ్చే వస్తువు, సుఖమును అనుభవించే వ్యక్తి యిరువురుకూడను మార్పు చెందుతూ ఉండటము వలన యీ ఆనందము మాత్రము మార్పు చెందకుండా ఉంటుందా?

జగత్తంతయూ మార్పు చెందునదే! కనుక 'అనిత్యం అసుఖం లోకం' అని గీత వర్ణిస్తూ వచ్చింది. అయితే యిక్కడ మూడు స్థాయిలుంటున్నాయి. సత్యములోని నిత్యం ఒకటి, సత్యములోని మిధ్య రెండవది, మిధ్యలో మిధ్య మూడవది. ఈ మూడింటి తత్త్వాన్ని మనము

sri sathyasai vahini

గుర్తించాలి. ప్రతి దానియందు మనము ఒకవిధమైన పరిశోధనలు చేయాలి. ఎంక్వైరీ చేయాలి. అదే మన బుద్ధి అనుసరించే పని.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతి వున్నను**
**హీనుడవగుణంబు మానలేడు.**

తన తత్త్వాన్ని తాను గుర్తించుకోలేకపోతున్నాడు, యీ చదువులవల్ల, లౌకిక విద్యలకు వ్యక్తిలోని హీనత్వాన్ని దూరంచేసే శక్తి, సామర్థ్యము లేదు. ఒక్క తపశ్శక్తికి మాత్రమే దానిని దూరం చేసే శక్తి ఉంది.

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞాన మెపుడు పొందలేడు**
**చదువులన్నియు చదివి చావంగనేటికి**
**చావు లేని చదువు చదవవలయు**

నీ money, నీ time, నీ energy సర్వము దీనికోసం ధారపోస్తున్నావు. ఇంతేకాదు, తల్లి తండ్రులకుకూడను యెంతో శ్రమను కలిగిస్తున్నావు. తల్లి తండ్రులు యెన్నో తిప్పలు పడి మిమ్ములను చదివిస్తున్నారు. అప్పులు చేసి చదివిస్తున్నారు. ఈ తిప్పలు పడి, అప్పులు చేసి మిమ్ములను చదివించినప్పటికి కడపటికి అన్ని విధాలా వారికి ముప్పును కలిగిస్తున్నారు. ఆ తల్లి తండ్రులకు తగిన ఆనందమును అందించటం లేదు.

**విద్యతోబాటు ప్రపంచ జ్ఞానము చాలా అవసరము**

విద్యార్థులారా! ముఖ్యముగా విద్యయొక్క అంతరార్థమును గుర్తించి తల్లితండ్రులను సంతోషపెట్టండి. ఇది విద్యయొక్క నిజమైన సారము. కని పెంచి పెద్దచేసి చదివించిన తల్లితండ్రులకే మనము సరైన సంతృప్తిని కలిగించలేనివాళ్లము ఇక ఇతరులకు యేరీతిగా కలిగించగలము? కనుకనే, మొట్టమొదట 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ.' 'దైవము, దైవమ'ని చెప్పకండి. కేవలము తెలియని తత్త్వముపైన ఆధారపడి. తెలిసిన, కంటికి

sri sathyasai vachanamrutam

కనుపించి, మనసుకు తెల్పించి, హృదయాన్ని మురిపించి, దేహాన్ని మరపించే తల్లితండ్రులను సంతృప్తి పరచండి. ఈ సంతృప్తి పరచే విద్యను మీరు నేర్చుకోండి. ఎంతకాలమైనా వారిపైన మీరు ఆధారపడి ఉండకండి. ఇంతవరకు వారు మిమ్మల్ని సాకి సంరక్షించారు. వృద్ధాప్యములో మీరు వారిని సంరక్షించటానికి ప్రయత్నించాలి. ఈ చదువులతోబాటు లౌకికంగా, భౌతికముగా, ప్రాకృతికంగా మీరు కొన్ని కర్తవ్యములు వహించాలి. యీ ఆధ్యాత్మికమే ప్రధాన లక్ష్యముగా ఉంచుకున్నప్పటికిని, లౌకికంకూడా దానికి అత్యవసరంగా తోడుగా ఉంటుండాలి. అది positive. దానికి negative లేకపోతే ప్రయోజనము ఉండదు. కనుక, 'విద్యతోబాటు General knowledge, commonsense చాలా అవసరముగా ఉంటుండాలి', అని గుర్తించాలి.

భగవంతునిపైన బాధ్యత వేసి మానవుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించినప్పుడు, 'యిహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మ విద్య' అన్నట్లుగా యిహ, పరములందు అన్ని విషయాలు భగవంతుడే చూచుకుంటాడు. కనుక, మొట్టమొదలు self confidence మీరు పెంచుకోవాలి, అప్పుడే మీకు self satisfaction వస్తుంది. ఈ satisfaction వచ్చినప్పుడే sacrifice చేస్తావు, ఈ sacrificeయే నీయొక్క self realisation. కనుక నీవు self confidence పెంచుకో. ఇదే ముఖ్యముగా విద్యలో ప్రధాన పునాది.

**(ది. 10-07-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam